మట్కా.. మాఫియా..!



ఇటీవల కాగజ్‌నగర్‌లో మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

- అత్యాశతో కుదేలవుతున్న కుటుంబాలు
- రోజుకు రూ.లక్షల్లో లావాదేవీలు
- పోలీసులకు సవాలుగా మారిన వైనం

కౌటాల: బతుకు బండి చక్రాన్ని లాగేందుకు, ప్రతిరోజూ కాయాకష్టం చేసుకునే కూలీలు, కార్మికులు మట్కా ఆటకు బానిసలుగా మారి సంపాదించిన సొమ్మును పోగొట్టుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగుతున్న మట్కా మహమ్మారికి అనేక కుటుంబాలు కుదేలవుతున్నాయి. తీవ్రంగా నష్టపోయిన పలువురు యువకులు కాగజ్‌నగర్ పట్టణంలో ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు కూడా ఉన్నాయి. టెక్నాలజీ విస్తరిస్తుండడంతో ఇంటర్నెట్ వేదికగా మట్కా నిర్వహిస్తున్నారు. తక్కువ సమయంలో సులభంగా డబ్బులు సంపాదించాలన్న అత్యాశలో పడి పేద, మధ్య తరగతి

గత మూడేళ్లలో జిల్లాలో నమోదైన మట్కా కేసులు..		
2021	2022	2023
69	67	72

ప్రజలు ఇళ్లు గుల్ల చేసుకుంటున్నారు. ఇటీవల కాగజ్‌నగర్ పట్టణంలో మట్కా ఆడుతున్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు.

ఉన్నదంతా హుష్..

ఎంత పెడితే అంతకు పదింతలు డబ్బు వస్తుందని మట్కా నిర్వాహకులు ఆశ చూపెడుతున్నారు. దీంతో మట్కా దందా జిల్లాలోని కాగజ్‌నగర్, రెబ్బెన, వాంకిడి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం, కౌటాల మండలాల్లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. యువకులు, కూలీలు జూదంతో ఉన్నదంతా పోగొట్టుకుంటున్నారు. రూ.5 నుంచి రూ. 10ల వడ్డీకి అప్పు చేసి మట్కా ఆడుతున్నారు. డబ్బులు పోగొట్టుకొని అప్పులు తీర్చలేక రోడ్డున పడుతున్నారు.

నిషేధం ఉన్నా..

మట్కా మాఫియాతో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. రాష్ట్రంలో ఈ క్రీడను నిషేధించారు. కానీ సమీప మహారాష్ట్రలో మట్కా దందాకు అనుమతి ఉండటంతో దాని ప్రభావం జిల్లాపై పడుతోంది. మహారాష్ట్రలోని ముంబాయి, బల్లార్ష, వని తదితర ప్రాంతాల్లోని నిర్వాహకుల నుంచి వివిధ పేర్లతో మట్కా చీటీలను రాసే వారికి 20 నుంచి 40 శాతం వరకు కమీషన్ అందుతున్నట్లు సమాచారం. పండ్ల వ్యాపారులు, కూలీలు, ఆటో డ్రైవర్లు, సామాన్యులే లక్ష్యంగా ఏజెంట్లు డబ్బులు సేకరిస్తూ చీటీలు రాస్తున్నారు. రోజూ సాయంత్రం ఆన్‌లైన్‌లో వచ్చే నంబర్లను ఫోన్ల ద్వారా ఏజెంట్లకు చేరవేస్తున్నారు. ఏజెంట్లను నియమించుకొని ఒక వైపు ఆన్‌లైన్, మరోవైపు చీటీల రూపంలో డబ్బులు సేకరించి గుట్టుచప్పుడు కాకుండా దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజులుగా పోలీసులు తనిఖీలు చేపట్టి మట్కా ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుంటున్నారు.

రూ.లక్షల్లో దందా..

జిల్లాలో వందల మంది మట్కా జూదానికి బానిసలవుతున్నారు. జూదానికి సంబంధించి నిత్యం రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. గత ఆగస్టు 27న కాగజ్‌నగర్ పట్టణంలోని నౌగాంబస్తీలో ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్న ఒకరిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణానికి చెందిన ఎస్కే ఆజిల్ వద్ద రూ. 2 వేల నగదుతో పాటు ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈ నెల 3న కాగజ్‌నగర్ పట్టణం అశోక్ కాలనీలో ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్న గోగర్ల సాయిను పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ. 1,250 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో మట్కా కట్టడికి పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న నాయకులు

బెజ్జూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలోని కొత్తగూడెం గ్రామం నుంచి లుంబినగర్ వరకు గుంతలమయంగా మారిన బీటీరోడ్డు పనులకు బీజేపీ నాయకులు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. రోడ్డు విషయమై ప్రజలు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు విన్నవించగా, స్పందించిన ఎమ్మెల్యే బెజ్జూర్ మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ రావు ఆధ్వర్యంలో రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. అనంతరం మాజీ జెడ్పీటీసీ మాట్లాడుతూ అటవీ శాఖ అనుమతులు లేని కారణంగా బీటీ రోడ్డు వేయలేకపోతున్నామని, త్వరలో అనుమతులు వస్తాయని, రోడ్డు పూర్తిగా బాగు చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, సింగిల్ విండో మాజీ చైర్మన్ ఎల్ములె మల్లయ్య, నాయకులు జాడి దిగంబర్, వసీఖాన్, బిక్షపతి, తిరుపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఎన్నికల అధికారుల నియామకం



నియమితులైన సంఘం ఎన్నికల అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: త్వరలో నిర్వహించనున్న పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికలకు ఎన్నికల అధికారులను నియమించారు. ఆదివారం పట్టణంలోని ద్వారకానగర్‌లోని పద్మశాలి సేవా సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులు దాసరి వెంకటేశ్, కొంగ సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల అధికారులుగా బూర సమ్మయ్య, గడదాసు నారాయణ, దాసరి శ్రీకాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ పర్యవేక్షణలో ఎన్నికలు జరుగుతాయన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు గడదాసు నారాయణ, బూర సమ్మయ్య, ఉపాధ్యక్షులు రవికుమార్, రాజయ్య, సదానందం, విశ్వేశ్వర్ రావు, గౌరవ సలహాదారులు శంకరయ్య, వెంకటి, సంయుక్త కార్యదర్శులు రమేశ్, గంగాధర్, వెంకటరాములు, నారాయణ, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు



సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యాహియా (తారీఖ్) ఆధ్వర్యంలో ఇంజినీర్లు శశిధర్, హ్యూమన్ అలీలను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య నీటిపారుదల సౌకర్యాలను కల్పించడంతో పాటు, తాగునీటి సౌకర్యాల కల్పనకు కృషిచేసి ఎంతో ఖ్యాతి పొందారన్నారు. లైన్స్ క్లబ్ డైరెక్టర్ రావుల వినేష్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వినాయక ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

చింతలమానెపల్లి: వినాయక ఉత్సవాల ముగింపు, నిమజ్జనం సందర్భంగా మండలంలో వినాయక మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఎస్సై నరేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. నిమజ్జనోత్సవాలలో డీజేలకు అనుమతి లేదన్నారు. మధ్యాహ్నం మూడు గంటలలోగా నిమజ్జనం ప్రారంభించాలని పేర్కొన్నారు. శాంతియుత వాతావరణంలో నిమజ్జనం నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. వినాయక విగ్రహాలను తరలించే ట్రాక్టర్లలో చిన్న పిల్లలను వాగులు, కుంటలు, చెరువులు, నదుల వద్దకు తీసుకు వెళ్లరాదని హెచ్చరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిర్పూర్(టి): కాగజ్‌నగర్ పట్టణం నుంచి సిర్పూర్(టి) మండలం మీదుగా మహారాష్ట్రలోని అన్నూర్ గ్రామానికి రేషన్ బియ్యం తరలిస్తున్న ట్రాలీ వాహనాన్ని ఆదివారం సిర్పూర్(టి) పోలీసులు పట్టుకున్నారు. సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఎండీ తాజ్, ఎండీ అఫ్జల్ అనే ఇద్దరు వ్యక్తులు కలిసి వాహనంలో సుమారు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా మండలంలోని జక్కాపూర్ గ్రామ సమీపంలో పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. జప్తు చేసిన బియ్యం, వాహనాన్ని సిర్పూర్(టి) పోలీసుస్టేషన్‌కు తరలించి నిందితులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బై బై గణేశా



నిమజ్జనంలో నృత్యం చేస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఆయా మండపాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. గణేశ్ మండపాల వద్ద లడ్డూ వేలం నిర్వహించారు. భక్తులు పోటాపోటీగా వేలం పాడారు. కౌటాల శ్రీ సాయి గణేశ్ మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక నృత్యాలు చేస్తూ సందడి చేశారు. సమీప చెరువులు, వాగుల్లో విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. బై బై గణేశా.. మళ్లీ రావా అంటూ గంగమ్మ ఒడిలోకి వదిలి వీడ్కోలు పలికారు.

బీజేపీలో చేరికలు



ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరిన రాంపూర్ గ్రామ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: దహెగాం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీజేపీలో చేరారు. ఆదివారం పట్టణంలోని సర్ సిల్క్‌కాలనీలో గల ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాంపూర్ గ్రామ నాయకులు ఓంప్రై సంజీవ్, కొండయ్య, జయరాం, గణేశ్, జాడిశ్రీను, మామిడిపల్లి బండేశ్, రవి, అక్షయ్‌లకు ఎమ్మెల్యే హరీశ్‌బాబు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మల్లాగౌడ్, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పొంచి ఉన్న ప్రమాదం

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్- కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలోని బుడుగుల వద్ద రోడ్డు పైకి పొదలు రావడంతో ప్రమాదం పొంచి ఉంది. రెండు చోట్ల పొదలు సగం రోడ్డుపైకి రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించే అవకాశం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చెట్ల పొదలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పెద్ద వాగు సమీపంలో ఆదివారం డీఎస్పీ రామానుజం పరిశీలించారు. నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థ సరిగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శంకరయ్య, రూరల్ ఎస్సై మహేందర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మేజరు గ్రామపంచాయతీతో పాటు మండలంలోని గ్రామాల్లో జరుగనున్న వినాయక నిమజ్జనం కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ కార్యదర్శి తిరుపతి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారులపై గుంతలను పూడ్చి వేయడంతో పాటు విద్యుత్తు దీపాలు ఏర్పాటు, స్థానిక నాగమ్మ చెరువులో నిమజ్జనం కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామాల్లో ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లను చేపడుతున్నారు.

గణేశ్ మండలి వద్ద ఫ్యాషన్ షో



ఫ్యాషన్ షోలో పాల్గొన్న చిన్నారులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బాపూనగర్ శారదా గణేశ్ మండలి వద్ద ఆదివారం రాత్రి చిన్నారులకు ఫ్యాషన్ షో నిర్వహించారు. పోటీల్లో మొత్తం 20 మంది వరకు చిన్నారులు పాల్గొనగా జైనూర్ సీఐ రమేశ్ విజేతలను ప్రకటించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన ఫ్యాషన్‌షోలో విజేతగా నిలిచి మొదటి బహుమతి పుల్లూరి గాయత్రి పొందగా, ద్వితీయ బహుమతి అనుశ్రీ, తృతీయ బహుమతి శ్రీమాన్ గెలుపొందారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు



పెంచికల్‌పేట్: నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



కాగజ్‌నగర్‌రూరల్: ప్రసాదం తింటున్న వానరం

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి రామాలయంలోని వినాయకుడికి ఆదివారం 35 రకాల నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. మండపం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

కాగజ్‌నగర్‌రూరల్: గణేశ్ నవరాత్రులు పురస్కరించుకొని 9వ రోజైన ఆదివారం గణనాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణంలోని మార్కెట్‌లో గల శ్రీసాయి గణేశ్ మండలి వద్ద పట్టణ సీఐ శంకరయ్య -స్వరూప దంపతులు గణనాథుడికి పూజలు చేశారు. సంఘం బస్తీలోని భజరంగ్ యూత్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

గణనాథుడిని దర్శించుకున్న వానరం..

కాగజ్‌నగర్‌రూరల్: ఎల్లాగౌడ్‌తోటలోని వివేకానంద గణేశ్ మండలి వద్ద ఆదివారం రాత్రి ఓ వానరం (కోతి) గణనాథుడిని దర్శించుకుంది. వినాయక విగ్రహం చుట్టూ తిరిగి ప్రసాదం తిని మౌనంగా అక్కడి నుంచి వెళ్లిపోవడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ఆసిఫాబాద్‌అర్బన్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఆదివారం వివిధ గణేశ్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. బ్రాహ్మణవాడ గణేశ్ మందిర్, జన్కాపూర్ రామాలయం, శివసాయి గణేశ్ మండలి, సాయినగర్‌తో పాటు పలు గణేశ్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. వాసవి గణేశ్ మండపం వద్ద వినాయకుడికి 101 రకాల పదార్థాలను నైవేద్యాలుగా సమర్పించారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

బెజ్జూర్: మండలంలోని మర్తిడి గ్రామానికి చెందిన దూపం ఆశన్న కుమారుడు దూపం సుధీర్‌కు సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేశారు. ఆదివారం కాగజ్‌నగర్‌లోని నివాసంలో బాధితుడికి చెక్ అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండ్రా మనోహర్ గౌడ్, బెజ్జూర్ మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'ఔట్‌సోర్సింగ్' నియామకాల్లో అక్రమాలు!



గురుకులాల కార్యదర్శి జారీ చేసిన ఉత్తర్వులు

కాగజ్‌నగర్‌రూరల్: జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల నియామకాల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఉపాధ్యాయుల నియామకం, పదోన్నతుల ప్రక్రియతో ఏడుగురు ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను టర్మినేట్ చేశారు. నియామకమైన పలువురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో గతంలో పనిచేసిన ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను తిరిగి నియమించుకోవాలని మైనార్టీ గురుకులాల కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. తొలగించిన ఏడుగురిలో ఐదుగురిని మాత్రం నియమించుకొని ఇద్దరి నియామకం చేపట్టలేదు. కాగా కొత్తగా ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో టీజీటీ ఇంగ్లిష్, గణితం పోస్టులను ఎలాంటి ప్రకటన జారీ చేయకుండానే అధికారులు ఔట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేశారు. ఈవిషయమై డీఎండబ్ల్యూవో రమాదేవిని సంప్రదించగా నిబంధనల ప్రకారమే ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు.

వ్యవసాయశాఖ అధికారికి వీడ్కోలు సమావేశం



ఏవోను సన్మానిస్తున్న రైతులు, నాయకులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని రైతువేదికలో బదిలీపై వెళ్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి రాజులనాయుడుకు మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు, ఫర్టిలైజర్ దుకాణాల యజమానుల ఘనంగా వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలు మండలంలో చేసిన సేవలు సంతృప్తినిచ్చాయన్నారు. విధి నిర్వహణలో సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏవో రామకృష్ణ, ఏఈవోలు శ్రీవిద్య, శివ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. నడిచేదెలా..?



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కసాబ్‌వాడీ పోచమ్మ గుడి సమీపంలో డ్రెయినేజీలు లేక మురికి నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మురుగు కాలువలు నిర్మించాలని కలెక్టర్‌తో పాటు మున్సిపల్ అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని, డ్రెయినేజీ నిర్మించి రోడ్డు రాకపోకలకు అనుకూలంగా మార్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కోలిండియా స్థాయిలో రాణించాలి



చెస్‌పోటీలు ప్రారంభిస్తున్న రాజమల్లు

రెబ్బెన: ఏరియాకు చెందిన క్రీడాకారులు కోలిండియా స్థాయిలో రాణించాలని బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూజీఎం రాజమల్లు అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో డబ్ల్యూపీఎస్ వార్షిక క్రీడల్లో భాగంగా ఆదివారం డిపార్ట్‌మెంటల్ చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాపోటీల్లో గెలుపోటములు సాధారణమని, వాటిని సమానంగా స్వీకరించడమే క్రీడా స్ఫూర్తికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పర్సనల్‌మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్‌బాబు, జనరల్ కెప్టెన్ జీపీ చంద్రకుమార్ పాల్గొన్నారు.